క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 25న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ జీ.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట, జేఎస్ఎం స్కూల్, అవంతి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 9 గంటల వరకు, నందిహిల్స్, జూపార్కు, హంటర్ హిల్స్, ఆర్కా స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

7న మాదిగల కవాతు

నయీంనగర్: జూలై 7న హనుమకొండలో జరగనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతుకు మాదిగ విద్యార్థులు, మేధావులు, ఉద్యోగస్తులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ పిలుపునిచ్చారు. 53వ డివిజన్ లష్కర్ సింగారంలో లష్కర్ సింగారం, నయీంనగర్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర వరదరాజు, బొడ్డు దయాకర్, ఎర్ర రాము, బొక్క రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలో నటించే అవకాశం



నయీంనగర్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య చిత్రంలో వరంగల్ జిల్లా కళాకారులకు నటించే అవకాశం ఇవ్వనున్నట్లు సినీ నిర్మాణ కమిటీ చైర్మన్ టీఎస్.స్వామి, దొడ్డి కొమురయ్య చిత్ర దర్శకుడు సేనాపతి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ హనుమకొండ పాత బస్‌డిపో స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి నటీనటుల ఎంపిక జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్యామ్‌కృష్ణ, భిక్షపతి, రామ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ



వరంగల్ లీగల్: జిల్లా కోర్టు న్యాయవాది ముక్తీశ్వరరావు జన్మదినం సందర్భంగా వరంగల్ బార్ అసోసియేషన్‌కు కంప్యూటర్‌ను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనకు బార్ అసోసియేషన్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తీగల జీవన్‌గౌడ్, మహమ్మద్ ముదసిర్ అహ్మద్ ఖయ్యూమీ, ఉపాధ్యక్షుడు సుదర్శన్, లైబ్రరీ సెక్రటరీ మురళి, ఈసీ మెంబర్లు పెండ్యాల అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, విక్రమ్, మహిళా ఈసీ మెంబర్ శృతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



హన్మకొండ అర్బన్: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, పరీక్ష మళ్లీ నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై బహిర్గతం కావద్దనే దురుద్దేశంతోనే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల రోజున నీట్ పరీక్ష ఫలితాలను ఆగమేఘాల మీద విడుదల చేసి విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్‌టీఏ వైఫల్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో నెట్టి వేయబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పొలబోయిన రాజు, పిట్టల సాయి, బన్నీ, సృజిత్ పాల్గొన్నారు.

కేయూలో శ్రమదాన కార్యక్రమం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, పరిశోధకులు హ్యూమానిటీస్ భవనం వద్ద సోమవారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేసి, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిరావు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి జనం బారులు

- హనుమకొండలో 193 వినతులు





వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అధికారులకు తమ సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తంగా 193వినతులు అధికారులకు అందాయి. ఎన్నికల నేపథ్యంలో సుమారు మూడు నెలలుగా ప్రజావాణి లేకపోవడం, కలెక్టర్‌గా నూతనంగా ప్రావీణ్య విధుల్లో చేరడంతో జనం పెద్దసంఖ్యలో వచ్చారు. వినతులు పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించారు. 'తమ భూమి ధరణిలో ఇతరుల పేరుతో చూపిస్తోందని, దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ధరణిలో మా పేరు వచ్చేలా చూడాలని' బీమారానికి చెందిన సౌందర్య వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో ఉచిత విద్య చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని టీఎఫ్ఎఫ్ అధ్యక్షుడు సునీల్ విన్నవించారు.

వరంగల్ జిల్లాలో..

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ సత్యశారదాదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి 84, ఉపాధి శాఖకు 10, మహానగర పాలక సంస్థ 4, షెడ్యూల్డ్ కులాల శాఖకు 3, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 124 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, జిల్లా సంక్షేమ అధికారి జి.హైమావతితోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఖిలావరంగల్ మండలం జక్కలొద్దిలో కబ్జాదారుల ఆధీనంలో భూమిని ఇప్పించాలని తిమ్మాపురం హవేలీకి చెందిన కావటి వెంకటమ్మ వినతిపత్రం సమర్పించారు.

'నమోదు'కు నానాఅవస్థలు!

- ఆందోళనలో లబ్ధిదారులు
- కిక్కిరిస్తున్న మీసేవ కేంద్రాలు



బల్దియా కార్యాలయంలో బారులుదీరిన జనం

వరంగల్ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులు నమోదుకు నోచుకోవడం లేదు. బల్దియా సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో అర్హతలున్నా లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ తర్వాత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం రెండ్రోజులుగా కొనసాగుతోంది. నగరంలోని 66 డివిజన్లలో ప్రజాపాలన దరఖాస్తులను వారం రోజుల పాటు స్వీకరించారు. సుమారు 1.6లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి చేతి రాత రశీదులు అందజేశారు. కానీ 'ఆన్‌లైన్'లో వివరాలు లేకపోవడంతో ప్రజలు నిరాశకు లోనవుతున్నారు. జీరో విద్యుత్ వినియోగం, గ్యాస్ సబ్సిడీ అందని లబ్ధిదారులు మళ్లీ బల్దియా మీ సేవ కేంద్రాల్లో కిక్కిరిస్తున్నారు. మూడ్రోజులుగా లబ్ధిదారులు 167 డిజిటల్ నంబర్లతో కూడిన వివరాలతో కేంద్రాల్లో నమోదు చేసుకుంటున్నారు. ఉన్నతధికారులు స్పందించి దరఖాస్తు చేసుకున్నా డేటా వివరాలు లేని లబ్ధిదారులకు మరోమారు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుడిసెవాసులకు పట్టాలు, మీటర్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఇల్లు లేక, ఇంటి కిరాయి కట్టలేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు జీఓ నంబర్ 58 ప్రకారంగా పట్టాలు, కరెంటు మీటర్లు ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అనేక ప్రభుత్వ భూములు, చెరువు శిఖాల్లో అనేకమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాగా వేసి కబ్జా చేసి వ్యాపారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి భూములను భూ బకాసురుల నుంచి రక్షించడం కోసం ఇల్లు లేని నిరుపేదలతో పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేయించినట్లు చెప్పారు. అనంతరం నాయకులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.ప్రభాకర్ రెడ్డి, ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, జిల్లా నాయకులు గాదె రమేష్, ఆలకుంట యాకయ్య, పెండ్యాల రవి, మంద మల్లేశం, కారు ఉపేందర్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



నయీంనగర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ: నూతన పీఆర్‌సీలో మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనంగా నిర్ణయించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఈనెల 27న హనుమకొండ కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 52, 53వ డివిజన్‌కు చెందిన మున్సిపల్ కార్మికులు నయింనగర్‌లో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ జీఓ నంబర్ 1037 ప్రకారం మున్సిపల్ కార్మికులకు కేటగిరీ వారిగా జీతాలు ఇవ్వాలని, 452 మంది కార్మికులు, హార్టీకల్చర్ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం రూ.16,600 ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాధిత కుటుంబానికి వెంటనే ఉద్యోగం ఇస్తూ నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. కార్మికులకు పనిముట్లు, యూనిఫాంలు, చీపుర్లు, చెప్పులు, ఆప్రాన్లు, కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, పారలు, గొడ్డళ్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘు, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, కమిటీ సభ్యులు అనిలు, కొర్నెలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థి వివరాలు నమోదు చేస్తున్న నిర్వాహకుడు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ నిర్వాహకులు సూచించారు. కొత్త ఆధార్ కార్డు, ఆధార్‌లో తప్పుల సవరణ, పుట్టిన తేదీలో మార్పులు చేర్పులు, ఫోన్ నంబర్ లింక్, చిరునామాలో మార్పులకు ఆధార్ కేంద్రాన్ని లేదా 9494729272, 8341198042 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు. నామమాత్రపు రుసుంతో ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి

న్యూశాయంపేట: సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. గనుల వేలంపై చట్టసభల్లో ప్రత్యేక చర్చ జరగాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని కోరారు. కేంద్రం ఈ వేలం ప్రక్రియను నిలిపివేయకుంటే అన్ని పార్టీలను ఐక్యం చేసి కార్మికులతో కలిసి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాజు, లక్ష్మణ్, రాజేందర్, పున్నంచందర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



హసన్‌పర్తి: ఇటీవల పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు హసన్‌పర్తి మండల కేంద్రంలో పోలీసులు సోమవారం అప్పగించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ జోడీ సత్యనారాయణ, స్థానిక రైతు గాండ్ల యాదగిరి, ఎల్కతుర్తి మండలం వల్భాపూర్‌కు చెందిన స్వాతి అనే విద్యార్థి ఇటీవల తమ ఫోన్లను మండల కేంద్రం పరిధిలో పోగొట్టుకున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు సీఆర్ఐఆర్ పోర్టర్ ద్వారా మొబైల్ ఫోన్లను గుర్తించి వారికి అప్పగించినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ క్రాంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మాఫియా చేతిలో విద్యారంగం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాలనలో విద్యారంగం పూర్తి మాఫియా చేతిలోకి వెళ్లిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.అక్బర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో పడిపోయారని అన్నారు. నీట్ పరీక్షను తక్షణమే రద్దుచేసి రాష్ట్రాల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈక్రమంలో ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, రవీందర్, రమేష్, గన్నారపు రమేష్, ఎలేందర్, బద్రి, చంద్రకళ, శంకరయ్య, కేశవులు, శరత్, రవి, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మెరుగైన వైద్య సేవలందించాలి



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఎంజీఎం: వయోవృద్ధులకు ఎంజీఎం ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు నెలకొల్పి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య కోరారు. ఈమేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంజీఎంలోని ఓపీ విభాగాన్ని అసోసియేషన్ నాయకులు సందర్శించి వయోవృద్ధులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం -2007 చట్టం మేరకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వయోవృద్ధులకు వైద్య సేవలందించిన ఘనత ఎంజీఎం ఆస్పత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరసయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యుడు గంగారపు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలు



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, వాటి గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికగుప్తాను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో విచ్చలవిడిగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రెచ్చిపోతున్నాయని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, అక్రమంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అమ్ముతున్నాయని వాపోయారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జస్వంత్, సాయి, సందీప్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు

- మున్సిపల్, రైల్వే సిబ్బంది స్పెషల్ డ్రైవ్



శానిటేషన్ డ్రైవ్‌లో రైల్వే, మున్సిపల్ అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ బూడిదగడ్డ ప్రాంతంలో మున్సిపల్, రైల్వే అధికారులు సంయుక్తంగా పారిశుద్ధ్య పనులను సోమవారం చేపట్టారు. రైల్వే ప్రాంతం - బూడిదగడ్డ మధ్యలో రెండేళ్ల క్రితం నిర్మించిన రెండు పెద్ద డ్రెయినేజీల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. దాంతో అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, శాంతినగర్, భవానినగర్, ఇంపీరియల్ కాలనీ, బాపూజీనగర్, డీజిల్ కాలనీల్లో నుంచి వరదనీరు డ్రెయినేజీలో కలిసి రైల్వే ప్రాంతం మీదుగా కడిపికొండలోని బోడగుట్ట వద్ద గల నాగుల చెరువులో కలుస్తోంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా మున్సిపల్ సిబ్బంది, రైల్వే శాఖ ఐఓడబ్ల్యూ సిబ్బంది పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో కాజీపేట ఏడీఈఎన్ రామకృష్ణ, ఐఓడబ్ల్యూ దిగ్విజయ్, శానిటరీ జవాన్ చంద్రమౌళి, వెంకటస్వామి, నాయకులు విజయ్‌కుమార్, ఎస్.మధుకర్, వంశీ, సదానందం, స్థానికులు ముస్తాక్, రాజేందర్, వీరబాబు, ఇబ్రహీం, నర్సింగరావు పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్య భద్రతే శాఖ ధ్యేయం



మాట్లాడుతున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

మామునూరు: స్పెషల్ పోలీసులకు మానసిక ఒత్తిడిని దూరం చేసి, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించడమే పోలీస్‌శాఖ ధ్యేయమని కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని టీఎస్ఎస్‌పీ నాలుగో బెటాలియన్‌లోని యూనిట్ ఆస్పత్రి ప్రాంగణంలో బేగంపేట్ మెడీ కవర్, వాసన్ ఐకేర్ వరంగల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కె.సాకేత్, సుమన్ బానిక్, శశిధర్, ప్రకాశ్, గోవింద్‌కుమార్, అన్వేషినితో కలిసి వైద్య శిబిరాన్ని కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో శ్వేత, శివ, ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, ఫార్మసిస్ట్ జలగం రమేష్‌కుమార్, సురేష్, రంజిత్‌కుమార్, నవీన్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైతు రుణమాఫీపై హర్షం

కేయూ క్యాంపస్: రూ.2 లక్షల రైతు రుణమాఫీపై యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్ మాట్లాడుతూ రైతులకు రుణమాఫీతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మల్లేశం, కేయూ జేఏసీ బాధ్యులు డాక్టర్ వీరస్వామి, నాయకులు డాక్టర్ సూరాసి కృష్ణ, డాక్టర్ తీగల ప్రేమ్‌కుమార్, మట్టెడ కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: 108 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని లేదా ప్రతీ ఉద్యోగికి 30శాతం తగ్గకుండా జీతాలు పెంచాలని 108 ఉద్యోగ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను వారు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్లకు కూడా వినతి పత్రాలు అందజేసినట్లు నాయకులు తెలిపారు. 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్‌రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చైతన్య, నాయకులు నరేష్, స్వామి, పాల్గొన్నారు.

నీట్ యూజీ ఎంట్రెన్స్ రద్దు చేయాలి

హసన్‌పర్తి: నీట్ యూజీ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఎర్రగట్టులోని హోటల్ స్వాగత్ గ్రాండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పీజీ ఎంట్రెన్స్‌కు ఒకరోజు ముందు ఆకస్మాత్తుగా రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల విద్యార్థులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా మానసిక ఆందోళనకు గురైనట్లు చెప్పారు. నీట్‌కు పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది నీట్ పీజీ, యూజీలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

మెడికో విద్యార్థులకు న్యాయం చేయాలి

హన్మకొండ: మెడికో విద్యార్థులకు న్యాయం చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి కోరారు. నీట్ పీజీ పరీక్షను ఆకస్మాత్తుగా రాత్రికి రాత్రే వాయిదా వేయడంతో పరీక్ష రాయాల్సిన విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి పరీక్ష రాసేందుకు వచ్చారని, పేద, మధ్య తరగతి విద్యార్థులు నష్టపోయారన్నారు. పీజీ పరీక్ష రద్దు చేసినట్లుగానే యూజీ ప్రవేశ పరీక్షను కూడా రద్దు చేయాలని పేర్కొన్నారు. 10శాతం ఎకనామిక్ వీకర్ సెక్షన్ రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు.

మార్కెట్‌లో సమస్యలపై చర్చ

సమస్యలు వివరించిన చాంబర్ ప్రతినిధులు

- సానుకూలంగా స్పందించిన అధికారులు



మార్కెట్ అధికారులతో సమావేశమైన చాంబర్ ప్రతినిధులు

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో నెలకొన్న పలు సమస్యలపై మార్కెట్ అధికారులతో కార్యవర్గ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈమేరకు మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ సెక్షన్ల కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు.

- మార్కెట్‌లోని అన్ని యార్డుల్లో క్లీనింగ్ సరిగా లేక మిర్చి, దుమ్ము, ధూళి ఎగిరి హమాలీ కార్మికులు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యార్డులను రోజువారీగా శుభ్రం చేయడానికి మ్యానువల్ క్లీనింగ్‌కు బదులు మిషనరీతో చేయాలని కోరారు.
- యార్డుల్లో వైఫై లేకపోవడంతో ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు, పీఓఎస్ మిషన్లకు బ్లూటూత్ నెట్‌వర్క్ పనిచేయక రైతు సరుకుల తూకాల్లో జాప్యం జరుగుతోంది. యార్డుల్లో ఇంటర్‌నెట్ సౌకర్యంలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
- వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలు పనిచేయక రైతుల, వ్యాపారుల సరుకులు తరచూ చోరీలకు గురవుతున్నాయి. యార్డుల వారీగా సీసీ కెమెరాలు బిగించి సెంట్రలైజ్డ్ చేసి సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.
- మార్కెట్ యార్డులోని మరుగుదొడ్లు శుభ్రంగా లేవు, అలాగే తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వెంటనే శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.
- యార్డు చుట్టుపక్కల 15 కిలోమీటర్ల పరిధిలో కోల్డ్ స్టోరేజీ, మిర్చి కల్లాలు, కాటన్ జిన్నింగ్, గ్రౌండ్‌నట్ ఆయిల్ మొదలగు పరిశ్రమలకు రైతు సరుకుల రవాణాకు సరైన రోడ్డు మార్గం లేక హమాలీలు, వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- లారీల కొరతతో సరుకు రవాణా చేయలేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న షెడ్లను తాత్కాలికంగా వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

అనంతరం జేడీఎం మల్లేశం మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిధులు కావాలని, అందుకు ఎప్పటికప్పుడు మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయానికి తెలియజేస్తున్నామని తెలిపారు. అతి త్వరలో కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, మిగతా సమస్యలపై అధికారులతో చర్చించి వారి ఆదేశాల మేరకు పరిష్కరిస్తామని అన్నారు. సమావేశంలో డీఎంఓ ప్రసాదరావు, ఉన్నతశ్రేణి కార్యదర్శి జి.రెడ్డి, గ్రేడ్-2 కార్యదర్శి రాము, చాంబర్ ప్రతినిధులు వేద ప్రకాశ్, ఎస్.రెడ్డి లింగారెడ్డి, చింతపల్లి వీరారావు, కటకం పెంటయ్య పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)